ప్రజలకు అండగా.. వైఎస్సార్ సీపీ

- ఘనంగా వైఎస్సార్ సీపీ అవిర్భావ దినోత్సవం
- ఉత్సాహంగా పాల్గొన్న శ్రేణులు



ఏటుకూరులోని పార్టీ కార్యాలయంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు స్థాపించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిమకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఏర్పాటు చేసిన నాటినుంచి నేటి వరకూ పేదకోసం పోరాటాలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో పేదలకు ఇంటి వద్దనే సంక్షేమ పథకాలను అందించిన మనసున్న నాయకుడు మన జగనన్న అని తెలిపారు. కూటమి ప్రభుత్వం కుట్రలు చేసి పేదలను మోసం చేసి గద్దెనెక్కి నేడు పేదలకు అందాల్సిన సంక్షేమాన్ని తమ జేబుల్లో వేసుకుని పేదల నడ్డి విరిచారన్నారు. యువత పోరు ద్వారా విద్యార్థులకు బకాయి ఉన్న ప్రతి రూపాయిని విద్యార్థులకు అందించే వరకూ ఉద్యమించాలన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పొన్నూరు: వైఎస్సార్ సీపీ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో బుధవారం వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలోని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ భవనం పద్మలీల మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్ రాణీ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం ప్రతి ఇంటికీ చేరిందన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, 108, ఆరోగ్యశ్రీ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలిచాయన్నారు. పార్టీ అధికార ప్రతినిధి ఎండేటి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసమే వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందని అన్నారు. ఆర్గనైజేషన్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమ పాలన చూశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య, నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు నాయకులు రుద్రపాటి ఆదిశేషులు, షేక్. షర్మిల, నాగేశ్వర రావు, మూర్తిరాజు, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

ప్రతి క్షణం ప్రజల కోసమే..

కాకుమాను: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి జననేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి క్షణం ప్రజల కోసమే పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పెదనందిపాడు మండల కన్వీనర్ షేక్ ఖాసీం పీరా అన్నారు. పెదనందిపాడు మండల పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఖాసీం పీరా మాట్లాడుతూ మాట్లాడుతూ 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15 ఏళ్లలోకి అడుగుపెడుతున్న ప్రజల పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆయన తెలిపారు. గత పదిహేను సంవత్సరాల నుంచి జననేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వెంటే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించిన ఏకైక నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అనుక్షణం పేదల అభివృద్ధికి పాటు పడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆయన కొనియాడారు. ఈసందర్భంగా గ్రామంలో ఉన్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, గ్రామ సర్పంచి దాసరి పద్మారావు, వైస్ సర్పంచి దివి రాంబాబు, మాజీ సొసైటీ చైర్మన్లు కూలేటి భూషయ్య, దివి నాగయ్య, గొట్టిముక్కల సుబ్బారావు పాల్గొన్నారు.



పొన్నూరులో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి అభివాదం చేస్తున్న నాయకులు



పెదనందిపాడులో పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న మండల కన్వీనర్ షేక్ ఖాసీం పీరా

పెండ్లి కుమారుడుగా అగస్త్యేశ్వరస్వామి



గుంటూరు రూరల్: నల్లపాడులోని అగస్త్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామిని పెండ్లికుమారుడి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు తుర్లపాటి ప్రసన్నాంజనేయశర్మ మాట్లాడుతూ కల్యాణ ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు, బలిహరణ, ఎదురుకోల ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 1 గంటలకు స్వామి కళ్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. 14వ తేదీన ప్రత్యేక పూజలతోపాటు స్వామి తలంబ్రాలోత్సవం, రథోత్సవం జరుగుతుందన్నారు. 15వ తేదీన పూజలు, అభిషేకాలు, హోమాలతోపాటు స్వామివారి వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బ్రహ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెనిగండ్ల గ్రామంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

శలపాడు(చేబ్రోలు): విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో బుధవారం దాతల సహకారంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. రిటైర్డు డీఎస్పీ కేసన భద్రాచలం సహకారంతో ఏపీ పాఠశాలలో వివిధ రకాల మొక్కలను పాఠశాల ప్రాంగణంలో నాటారు. కార్యక్రమంలో మన్నెం వేణుగోపాలరావు, హెచ్‌ఎం బ్రహ్మయ్య, హైమావతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

వెనకబడి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కాకుమాను: తరగతిలో వెనుకపడిన సీ, డీ గ్రేడుల విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ కోరారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం పాఠశాల హెచ్‌ఎం బి.సత్యం అధ్యక్షతన నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు తమ వంతు కృషి చేసి ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. 1, 2, తరగతులకు ప్రదర్శించబడిన ఒత్తులు, మాదిరి పాఠ్యాంశ బోధన, 3,4,5 తరగతులకు వ్యవసాయం పాఠ్యాంశ బోధన గురించి సలహాలు, సూచనలు చేశారు.

పెదకాకాని దర్గాలో అక్రమాలపై చర్య తీసుకోండి

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా పెదకాకాని దర్గాలో అక్రమాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్‌లకు స్థానికులు బుధవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు, పెదకాకాని ఈఓ కుమ్మక్కై అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దాదాపు పది అంశాల్లో జరిగిన అవకతవకలను వివరాలతో అందించారు. ఈ నెల 29, 30 తేదీల్లో దర్గా ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్న తరుణంలో నిధులు కాజేసిన వారిపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో షేక్ సల్మాన్, షేక్ ఆషా, షేక్ బాజీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేబ్రోలు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడుని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. నారాకోడూరు గ్రామానికి చెందిన బి.వేణు పనుల నిమిత్తం గుంటూరు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. గ్రామ సమీపంలోని నవీనా హోటల్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయపడ్డాడు. బాధితుడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

పొన్నూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని నేతాజీనగర్ మునిసిపల్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు కె. గౌరీ శంకర్ పాల్గొని పరీక్షలపై ఆందోళన చెందకుండా రాయగలిగే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదివిన సబ్జెక్టులను ఎలా గుర్తు పెట్టుకోవాలి, పరీక్షల్లో విజయం ఎలా సాధించాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ వి.వి.గుప్తా, సభ్యులు పి.రవీంద్రనాథ్, కె. వెంకటేశ్వర్లు, డాక్టర్ హిమబిందు, ఎ.వి.కృష్ణదేవ్, పి.గణేష్, ఆర్.కిరణ్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు దాతలు పరీక్ష సామగ్రిని బుధవారం అందజేశారు. తెనాలి ప్రాంతానికి చెందిన సీహెచ్ సాంబయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్, పెన్ను, పెన్సిల్, జామెంటరీ బాక్సులను ట్రస్టు అధ్యక్షుడు సీహెచ్ భాస్కరరావు పంపిణీ చేశారు. కరస్పాండెంట్ గాదె వెంకట సుబ్బారెడ్డి, హెచ్‌ఎం మోహనరెడ్డి, శంకరరెడ్డి పాల్గొన్నారు.

జనావాసాల మధ్య టుబాకో కంపెనీ నిర్వహణపై విచారణ



పెదకాకానిలోని పొగాకు కంపెనీ వద్ద విచారణ చేపట్టిన ఎంపీడీఓ శ్రీనివాసరావు

పెదకాకాని: ప్రజలు నివసిస్తున్న ఇళ్ల మధ్యలో పొగాకు గ్రేడింగ్ కంపెనీ నిర్వహణపై విచారణ చేపట్టినట్లు మండల అభివృద్ధి అధికారి రమావత్ శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని ప్రధాన సెంటర్ నుంచి పాతూరు వెళ్లే రోడ్డులో గత కొంతకాలంగా టుబాకో కంపెనీ నిర్వహిస్తున్నారు. గృహ నివాసాల మధ్యలో కంపెనీ నిర్వహించడం వలన పొగాకు వాసనలు, దుమ్ము కారణంగా స్థానికంగా నివసించే ఐదుగురికి క్యాన్సర్ సోకి మరణించారని సీపీఐ నాయకుడు పుప్పాల సత్యనారాయణ, స్థానికులు ఇటీవల గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు కంపెనీ నిర్వహణకు ఉన్న అనుమతులు, సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా, ఇండస్ట్రీయల్ నిర్మాణాలకు అనుమతులు పొందారా అనే అంశంపై విచారించారు. అలానే పొల్యూషన్ అనుమతులు, విద్యుత్‌శాఖ నివేదిక, వైద్యాధికారుల రిపోర్టు సేకరించి నివేదిక తయారు చేయడం జరుగుతుందన్నారు. పూర్తిస్థాయిలో తయారు చేసిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనంపై ఆలూరులో ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర రావు

పొన్నూరు: మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మండల పరిషత్ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం ప్రారంభించారు. మండలంలోని ఆలూరులోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామాన్ని పొన్నూరు మున్సిపాలిటీలో విలీనం చేయాలా.. వద్దా అనే అంశంపై గ్రామస్తుల నుంచి సంతకాల రూపంలో అభిప్రాయాన్ని సేకరించారు. అయితే మున్సిపాలిటీలో కలపడం వలన కలిగే ప్రయోజనాలు, నష్టాలను అధికారులు వివరించడం లేదని ప్రజలు నుంచి అభిప్రాయం వ్యక్తమైంది. మున్సిపాలిటీలో విలీనం చేయమని ఒక్కరు కూడా సంతకం చేయలేదని అధికారులు వెల్లడించారు. ఈఓపీఆర్‌డీ కేఎస్ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి శాంత కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదే విషయమై గురువారం ఉదయం 11 గంటలకు చింతలపూడిలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

సిబార్ డెంటల్ సైన్సెస్‌తో ఆర్‌వీఆర్‌జేసీ ఒప్పందం



ఎంఓయూ పత్రాలను చూపుతున్న కళాశాలల ప్రతినిధులు

గుంటూరు రూరల్: వైద్య రంగంలో సాంకేతిక వినియోగం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, రోగ నిర్ధారణ వైద్య పరిష్కారాల్లో నూతన ఆవిష్కరణలకు తోడ్పడేందుకు సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌తో, ఆర్‌వీఆర్‌జేసీ ఈఎస్‌టీపీ ఫౌండేషన్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ ఎంఓయూ వల్ల ఆధునిక వైద్య సాంకేతిక పరిశోధనలలో నూతన మార్గాలకు దోహదం చేయనుందన్నారు. బయోటెక్నాలజీ, బయో మెడికల్ ఇంజినీరింగ్, డెంటల్ రంగాల్లో పరిశోధన, ఇన్నోవేషన్‌లలో అభివృద్ధికి ఈ ఒప్పందం దోహదపడుతుందని సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, డెంటల్ వైద్యసేవలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం శుభపరిణామమని, ఆర్‌వీఆర్‌జేసీతో కలిసి పని చేయడం వల్ల పరిశోధనలు మరింత వేగవంతం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, ఐటీబీఐ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, సీఈఓ డాక్టర్ మహేంద్రవర్మ, ఇంక్యుబేషన్ మేనేజర్ డాక్టర్ కె.శోభా, సిబార్ వైద్యశాల డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ సరిత పాల్గొన్నారు.

కౌలు రైతుల ఆత్మహత్యలను నివారించాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య
- సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న పి.జమలయ్య

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలల కాలంలో 180 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే అందులో 90 శాతం కౌలు రైతులు ఉన్నారని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి సంఘం అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి అధ్యక్షత వహించారు. జమలయ్య మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు గుర్తింపు కార్డు లేదని, గుర్తించక పోవడం బాధాకరంగా ఉందన్నారు. కౌలురైతుల ఆత్మహత్యలను గుర్తించి బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పన ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలురైతుల సాగు కోసం తీసుకున్న బ్యాంకు మరియు ప్రైవేటు అప్పులను మాఫీ చేయాలన్నారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం మాట్లాడుతూ భూ యజమాని ప్రమేయం లేకుండానే గ్రామ సభలలో నేరుగా కౌలురైతులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ఫార్మర్ రిజిస్టర్‌లో కూడా కౌలురైతులను నమోదు చేయాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా చూడాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గుంటూరువారితోటలోని శ్రీపులిపాక కమలా హనుమంతరాయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు బుధవారం మత్తు పదార్థాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా శేఖర్ బాబు మాట్లాడుతూ అవగాహనతోనే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించగలమని అన్నారు. మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, నిత్యజీవితంలో ఎంతో మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా మాదక ద్రవ్యాల కు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, కౌన్సెలింగ్, డి-అడిక్షన్ సెంటర్లకు పంపించడంలో ప్రతి ఒక్కరు తమ వంతు సామాజిక బాధ్యతగా తీసుకుంటే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చు అని అన్నారు నీతోడు మానసిక వికాస కేంద్ర జోనల్ సమన్వయకర్త కె.ప్రియాంక మాట్లాడారు. వివరాలకు 9490492020 నంబర్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సమన్వయకర్త బి.రమేష్, ఎంఈవోలు బీవీ రమణయ్య, కె. జ్యోతికిరణ్ పాల్గొన్నారు.

మిర్చి కొనుగోలుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

లక్ష్మీపురం: మిర్చి కొనుగోలుకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాక పోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన మహంకాళి అనే వ్యక్తి మిర్చి యార్డు వద్ద కమీషన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 4వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి నంద్యాలలో మిర్చి కొనుగోలు కోసం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య జ్యోతి బంధుమిత్రులను, సన్నిహితులను విచారించగా ఎంతకు జాడ తెలియక పోవడంతో భార్య జ్యోతి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

నగరంపాలెం: కుమార్తె అదృశ్యంపై తండ్రి పాతగుంటూరు పీఎస్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాత గుంటూరు మణిహోటల్ సెంటర్‌కు చెందిన పి.కోటేశ్వరరావు తన కుమార్తె మంగళవారం డీమార్ట్‌కు వెళ్లివస్తానని చెప్పి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

నంబూరు హైస్కూల్‌లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఏర్పాటు



నంబూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రూప్‌తో ఉపాధ్యాయులు

పెదకాకాని: విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి వి.శంకరరాజు అన్నారు. మండలంలోని నంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బుధవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం(బాలుర) ట్రూప్, బాలికల కోసం నూతనంగా గైడ్ కంపెనీని ప్రారంభించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల, నంబూరు జిల్లా పరిషత్ పాఠశాలలు పీఎంశ్రీ(పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)కి ఎంపికయ్యాయి. ఈ ఎంపికలో భాగంగా నంబూరులో ఆసక్తి ఉన్న బాలికల కోసం గైడ్ కెప్టెన్ స్వరూపరాణి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే గైడ్ యూనిట్‌ను, బాలురు కోసం స్కౌట్స్ మాస్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే స్కౌట్స్ ట్రూప్‌ను అధికారులు ప్రారంభించారు. సమావేశానికి హెచ్‌ఎం ఎం ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకరరాజు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులు శారీరిక దారుఢ్యంతో పాటు దేశభక్తి సేవాభావం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్, జిల్లా కార్యదర్శి ఎం.ఏడుకొండలు, ఈమని ప్రతాపరెడ్డి, పూర్వ విద్యార్థి సంఘ నాయకుడు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎల్.నాగరాజు, గైడ్ కెప్టెన్ స్వరూపరాణి, స్కౌట్ మాస్టర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఈ ప్రసన్నకుమారి, డి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్‌దే భవిష్యత్



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), మెషిన్‌లెర్నింగ్(ఎంఎల్) భవిష్యత్‌ను నిర్మించటానికి మనకు ఉన్న అతి శక్తివంతమైన సాధనాలని జెనీవాకు చెందిన యునైటెడ్ నేషన్ అడ్వైజర్ క్యూబిడీ రంజిత్‌బార్షికర్ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ట్రాన్స్‌ఫార్మింగ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ అండ్ ఫార్మకో ఎకనామిక్స్ త్రు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) అండ్ మిషన్ లెర్నింగ్(ఎంఎల్) అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న 4వ అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ అధ్యక్షత వహించారు. రంజిత్‌బార్షికర్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) మిషిన్ లెర్నింగ్ (ఎంఎల్) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీటి ద్వారా కంప్యూటర్లు మనిషి లాగే ఆలోచించగలిగే, నిర్ణయాలు తీసుకోగలిగే సామర్థ్యాన్ని పొందుతున్నాయన్నారు. ఫార్మసీ ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులను తెచ్చాయని వివరించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఏఐ అనేది కంప్యూటర్లకు మానవ మేధ లాంటి సామర్థ్యాన్ని అందించే సాంకేతికతని, కంప్యూటర్లు ఐడియాలు అర్థం చేసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, నిర్ణయాలు తీసుకోవడం లాంటివి చేయగలవని చెప్పారు. మలేషియా క్వెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డీన్, ప్రొఫెసర్ దాతుక్, డాక్టర్ అల్లెన్ మాథ్యూస్, బెంగళూరు ఆక్సోక్రోమోఫోర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి శ్రేయస్ బుర్జి, ఈజిప్ట్ కింగ్ సాల్మన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఫతుమన్సూర్, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్టర్ డాక్టర్ ఎం.విలియం క్యారీ, క్లిన్ ఫార్మెట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ వెంకటేశ్వరస్వామిదేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోపణ, వాస్తు హోమం, ధ్వజపటాధివాసం కార్యక్రమాలను వేద పండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాత కోట బ్రాహ్మణయ్యనాయుడు, దాసరి భాస్కర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాజకీయ వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలి

లక్ష్మీపురం: ఆశ వర్కర్‌పై రాజకీయ వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నం చేసి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సామ్రాజ్యంను సీఐటీయూ బృందం బుధవారం పరామర్శించింది. పల్నాడు జిల్లా అమరావతి మండలం అత్తలూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఉంగుటూరు గ్రామానికి చెందిన ఆశ వర్కర్ రాయపాటి సామ్రాజ్యంపై రాజకీయ కారణాలతో తొలగించాలని 200 మందికి పైగా పిహెచ్‌సి వద్దకు వచ్చి వేధింపులు గురి చేయటం కారణంగా గత్యంతరం లేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ధనలక్ష్మి మాట్లాడుతూ సామ్రాజ్యం ఆమె నిర్వహిస్తున్న విధులు లోపాలు ఏమైనా ఉంటే పరిశీలించాలి కానీ రాజకీయ కారణాలతో 200 మందిని తీసుకొచ్చి తీసివేస్తారా లేదా అని బెదిరిస్తే మహిళ అయి ఉండి ఏమి చేయాలో పాలు పడక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు, పలు సంఘాల నాయకులు జి.రమణ, శివకుమారి, కె.లక్ష్మి, కే శ్రీనివాసరావు, బి.సూరిబాబు, ముత్యాలరావు, బి.లక్ష్మణ రావు, ధనలక్ష్మి, జ్యోతి, రేణుక, ప్రమీల, సుమతి, నాగమణి, సమీర్ పాల్గొన్నారు.